క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట



పెనమలూరు: యనమలకుదురు గ్రామం సంజీవయ్యనగర్‌లో సోమవారం విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలో సీతారామాలయంలో శ్రీ లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ సీతారామస్వామివార్ల శిలా విగ్రహాలను ప్రతిష్ఠించటానికి గత నాలుగు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 7.28 గంటలకు ఆలయ అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, శాంతికల్యాణం జరిపించారు. ఆడపడుచులకు నూతన వస్త్రాలు బహూకరించారు. భక్తులు దాదాపు 5 వేల మందికి అన్నసమారాధనం చేశారు.

బదిలీపై వచ్చిన 55 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరిక

గన్నవరంరూరల్: మండలంలోని పాఠశాలల్లో కొత్తగా 55 మంది ఉపాధ్యాయులు బదిలీలపై వచ్చి విధుల్లో చేరినట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. 24 మంది సెకండరీ గ్రేడ్ టీచర్‌లు, 14మంది స్కూల్ అసిస్టెంట్‌లు, ఏడుగురు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు జాయిన్ అయ్యారని వివరించారు.

మండవ సేవలు అభినందనీయం



కంకిపాడు: విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో మండవ శ్రీనివాస్ అందించిన సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. నెప్పల్లి జెడ్పీ పాఠశాల నుంచి ఈడుపుల్లు జెడ్పీ పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుడు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మండవ శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. విద్యార్థుల ఉన్నతి, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలోనూ శ్రీనివాస్ చేసిన కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేఎల్ సంపూర్ణ, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు సాయి పాల్గొన్నారు.

బాపులపాడు ఎంపీడీవోగా జోగేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.జోగేశ్వరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఇటీవల ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి లభించింది. బాపులపాడు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈవోపీఆర్డీ కె.ప్రభాకరరావు ఇటీవల ఉద్యోగోన్నతిపై గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో బాపులపాడు ఎంపీడీవోగా జోగేశ్వరరావు నియమితులయ్యారు.

రూ. 12.87 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

పెనమలూరు: కానూరులోని పెనమలూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. కానూరు సనత్‌నగర్‌లో ఉంటున్న అంగన్‌వాడీ ఆయా గుల్షద్‌బేగం కోవిడ్ సమయంలో ఫ్రంట్‌లైన్ వర్కర్‌గా పని చేశారు. ఆమె తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందింది. ఆమెకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో సీఎం సహాయనిధి నుంచి రూ. 3 లక్షల చెక్కు ఆమె కుటుంబ సభ్యులకు మంజూరైంది. అదే విధంగా యనమలకుదురు కృష్ణానదిలో ఈతకు వెళ్లి ప్రమాద వశాత్తూ మృత్యు వాతపడిన రెహమాన్‌ఖాన్, షేక్ సమీర్, షేక్ రహెమాన్‌బాషా కుటుంబ సభ్యులు తలా రూ. లక్ష చొప్పున చెక్కులు ఎమ్మెల్యే పార్థసారథి అందచేశారు. ఉయ్యూరు ప్రాంతంలో బాధితులకు కూడా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొలుసు నితిన్‌కృష్ణ, జంపాన పూర్ణిమ, మాజీ ఎంపీటీసీ సభ్యులు చాంద్‌బాషా, షేక్. ఖదర్, పఠాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పరిశోధనా శాస్త్రవేత్తగా డాక్టర్ సుధారాణి



కంకిపాడు(పెనమలూరు): ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానంలో కీటక నివారణ విభాగం సీనియర్ శాస్త్రవేత్తగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి ఉత్తమ పరిశోధనా శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు. ఈ మేరకు గుంటూరులోని లాంఫామ్‌లో అవార్డును, బంగారు పతకాన్ని అందుకున్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 59వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా ఉత్తమ పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలను గుర్తించి అరుదైన పురస్కారాలను అందించారు. ఇందులో భాగంగా ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానంలో కీటక నివారణ విభాగంలో పనిచేస్తున్న సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సుధారాణిని ఉత్తమ పరిశోధనా శాస్త్రవేత్తగా ఎంపిక చేసి అవార్డు అందించారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం



పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుకలను పంపిణీ చేస్తున్న నక్కా గాంధీ, ప్రజాప్రతినిధులు

కంకిపాడు: విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండల స్థాయిలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమం పునాదిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, ఎంఈఓ కనకమహాలక్ష్మి, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, జగన్నాథపురం సర్పంచ్ పి.శ్రీనివాసరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కొల్లి నాని పాల్గొన్నారు.

- కోలవెన్ను ఎంపీపీ, జెడ్పీ పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- గొడవర్రు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన విద్యా కానుక కిట్ల పంపిణీలో సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ చెన్ను బాబూజీ, హెచ్‌ఎం కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.
- మద్దూరులో నిర్వహించిన కిట్ల పంపిణీలో విద్యుత్ శాఖ ఏఈ తాళ్లూరి అశోక్‌కుమార్, సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ ఒడుగు శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ పోతాబత్తుల రవి పాల్గొన్నారు.

గన్నవరంలో..

గన్నవరం: పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. దావాజీగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి చేతుల మీదుగా జీవీకే కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, సర్పంచ్ బడుగు బాలమ్మ, పంచాయతీ కార్యదర్శి సత్యబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో జెడ్పీటీసీ చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ నిడమర్తి రామారావు, హెచ్‌ఎం ఎన్.రవీంద్రభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జెడ్పీటీసీతో పాటు జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ కాలగద్ద నాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీ మౌనిక జీవీకే కిట్లను విద్యార్థులకు అందజేశారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన

రామవరప్పాడు: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నారని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ప్రసాదంపాడు ఎంపీ ప్రైమరీ పాఠశాలలో జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు మాట్లాడుతూ విద్యార్థులకు అందించిన కిట్లలో మూడు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, బెల్ట్, బూట్లు, రెండు జతల సాక్స్, బ్యాగ్‌ను కిట్ రూపంలో అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దూరు రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎనికేపాడులో...

విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్, తిప్పనగుంట పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట



తాడిగడప జెడ్పీ ఉన్నత పాఠశాలలో కిట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ ప్రకాశరావు

పాఠశాలలో ఎంపీటీసీ రాచమళ్ల రత్నకుమారి ఆధ్వర్యంలో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. వార్డు సభ్యుడు కలపాల భాను, హెచ్‌ఎం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌పై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి పలు పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలోని 65 పాఠశాలల్లో చదువుతున్న 4,914 మంది విద్యార్థులకు 'జగనన్న విద్యా కానుక' కిట్లను సోమవారం పంపిణీ చేశారు.

పెనమలూరులో విద్యా కానుక కిట్లు పంపిణీ..

పెనమలూరు: మండల పరిధిలో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లు ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేశారు. తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత పీడీ కె.క్రిష్టోఫర్, పీసీ కమిటీ చైర్మన్ ఎ.బాబూరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

- పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు కిట్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం వై.దుర్గాభవాని పాల్గొన్నారు.
- వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచి చెక్క విజయ, ఉపసర్పంచి గద్దల రాజ జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులకు పంపిణీ చేశారు.
- గంగూరు ఉర్దూ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు గని, అబ్దుల్ అజీజ్ కిట్లు పంపిణీ చేశారు.



దావాజీగూడెంలో కిట్లు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



ప్రసాదంపాడులోని పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



నున్నలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉంగుటూరులో విద్యాకానుక పంపిణీ

ఉంగుటూరు: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు దుట్టా సీతారామలక్ష్మి అన్నారు. మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ జరిగింది. ప్రభుత్వ తోడ్పాటును ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకుని ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంపీపీ వి.సరోజిని, ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుకల పంపిణీ

గన్నవరంరూరల్: విద్యార్థులు ఉన్నతంగా చదవాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, సర్పంచ్ రాధాకృష్ణ, పీఎంసీ చైర్మన్ కందుల రాజేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల మైనార్టీ నాయకులు షేక్ బాజీ, ఉపాధ్యాయులు దామోదర గణపతిరావు తదితరులు పాల్గొన్నారు. గోపవరపుగూడెం ఎంపీపీ పాఠశాలలో సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. పీఎంసీ కమిటీ చైర్మన్ రాధాకుమారి, వార్డు సభ్యులు చిట్టినేని కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుకల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 700 మంది విద్యార్థులకు ఈ కిట్లను అందజేశారు.ఎంపీపీ చెన్ను ప్రసన్నలక్ష్మి , హెచ్‌ఎం భూపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సువర్ణరాజు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ సరోజిని, సర్పంచ్ కాటూరి సరళ, ఎంఈవో వెంకటరత్నం పాల్గొన్నారు.

రామలింగేశ్వరుని ధ్వజస్తంభ పునఃప్రతిష్ట ఉత్సవం

కంకిపాడు: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో జీవధ్వజస్తంభ పునఃప్రతిష్టా మహోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. దేవదాయశాఖ, ఉత్సవ నిర్వాహక కమిటీ పర్యవేక్షణలో ఈనెల 10వ తేదీ నుంచి ఆలయ ప్రాంగణంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పీటలపై కూర్చొని స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేయించారు. కుందుర్తి సత్యనారాయణ మూర్తి, నందివెలుగు బాలాజీ గురుకుల్ పర్యవేక్షణలో జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ట, మహా కుంభాభిషేకం వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో అన్నసంతర్పణ నిర్వహించింది. కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి రాజా రమేష్ పర్యవేక్షించారు.

గ్రంథాలయాలతో జ్ఞాన సముపార్జన

పెనమలూరు: విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానం పొందాలని మండల విద్యాశాఖ అధికారి కనకమహాలక్ష్మి అన్నారు. పెనమలూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగియటంతో పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గ్రంథాలయాలలో చాలా ముఖ్యమైన సమాచారం, విజ్ఞానంతో కూడిన పుస్తకాలు ఉంటాయన్నారు.పెనమలూరు గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, ఈవోపీఆర్డీ కోరాశ్రీనివాసరావు, గ్రంథాలయ అధికారి పి.హరీషా పాల్గొన్నారు.

చెంగుచెంగున మళ్లీ బడికి

జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభం

- ప్రభుత్వ ఆదేశాలతో ఒంటిపూట బడులు నిర్వహణ
- తొలి రోజే విద్యాకానుక అందజేత
- పాఠశాలల్లో పండుగ వాతావరణం

కంకిపాడు(పెనమలూరు): వేసవి సెలవులు ముగియటంతో విద్యార్థులు సెలవులకు టాటా చెప్పి బడి బాట పట్టారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సోమవారం కృష్ణా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పండుగ వాతావరణం కనిపించేలా పాఠశాలలను ముస్తాబు చేశారు. విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను తొలి రోజే అందించారు. జిల్లాలో పలు ప్రైవేటు పాఠశాలలు సోమవారం ప్రారంభమయ్యాయి.

1,369 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎంపీపీ, మునిసిపల్, ఎయిడెడ్ యాజమాన్యాల్లో మొత్తం 1,369 పాఠశాలలు ఉన్నాయి. 2023–24 విద్యాసంవత్సరం క్యాలెండరు ప్రకటించిన విధంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రాంగణాలను అరటి చెట్లు, కొబ్బరి ఆకులను స్వాగత ద్వారాలకు అమర్చి, పూలతో ముస్తాబు చేశారు.



మామ ఇచ్చిన కానుక.. విద్యా కానుక కిట్లతో విద్యార్థినులు

తొలి రోజే విద్యాకానుక అందజేత

పాఠశాలలు పునః ప్రారంభం రోజే విద్యాకానుక విద్యార్థులకు అందాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యాశాఖకు సూచించారు. ఆ మేరకు పుస్తకాలు, యూనిఫాం, నోటుపుస్తకాలు, బ్యాగులు, షూలు వగైరాతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మన్నికతో కూడిన విద్యా కానుకను పాఠశాల ప్రారంభం మొదటి రోజునే విద్యార్థుల చేతికి అందించారు. జిల్లాలో 1,369 పాఠశాలల్లో 1,10,148 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

విద్యార్థుల ఆరోగ్యానికి పెద్ద పీట

పాఠశాలలు ప్రారంభించినా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం బాధ్యతతో చర్యలు తీసుకుంది. ఎండ తీవ్రత తగ్గకపోవటంతో ఒంటి పూట బడులు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. ఆ మేరకు ఉదయం 7.30 గంటలకు పాఠశాలలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 11.30 గంటల వరకూ తరగతులు నిర్వహించి విద్యార్థులను ఇళ్లకు పంపారు. ఈ క్రమంలో ఉదయం 8.30 నుంచి 9 గంటల నడుమ విద్యార్థుల ఆరోగ్యానికి దోహదపడే రాగిజావ పంపిణీ చేశారు. పాఠశాల అనంతరం జగనన్న గోరుముద్ద అందించారు. ప్రతి విద్యార్థీ రాగిజావ, మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖ పర్యవేక్షించింది. ఈ నెల 17వ తేదీ వరకూ ఒంటిపూట బడులు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యాభివృద్ధికి, ఆరోగ్యపరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఉంగుటూరులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉంగుటూరు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసినందుకు మండలంలోని పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కాంట్రాక్ట్ ఉద్యోగులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టి తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు కొత్త పీఆర్‌సీ రికమెండ్ చేసి, కొత్త రాయితీలు ప్రకటించి, సచివాలయ ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పించడం చారిత్రక నిర్ణయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోఆర్‌డీ బాషా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అరటి నార ఉత్పత్తులతో మహిళల ఆర్థిక ప్రగతి



అరటి నార ఉత్పత్తులపై శిక్షణ పొందుతున్న మహిళలు

గన్నవరంరూరల్: అరటి నారతో తయారు చేసే ఉత్పత్తులపై మహిళలు శిక్షణ పొంది ఆర్థిక ప్రగతి సాధించాలని సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడ అధ్యక్షురాలు కె.రమాదేవి చెప్పారు. ఎలీప్(మహిళా పారిశ్రామిక వాడ) ఆధ్వర్యంలో అరటి నారతో పర్సులు, బ్యాగులు, బుట్టలు తయారు చేసే శిక్షణను ఆమె సోమవారం ప్రారంభించారు. 15 రోజులపాటు జరిగే ఈ శిక్షణకు 20 మంది హాజరయ్యారని చెప్పారు. శిక్షణ అనంతరం వచ్చే ఆర్డర్లను బట్టి మహిళలు అరటి నార ఉపకరణాలు తయారు చేస్తారన్నారు. శిక్షణ ఇచ్చేందుకు తమిళనాడు నుంచి మాస్టర్ ట్రైనర్‌లను రప్పించినట్లు, మహిళలు నేర్చుకుని, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. చైర్ పర్సన్ కె.కనకదుర్గ, ఎలీప్ ప్రతినిధి పి.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

కూలిన భారీ వృక్షం, విద్యుత్ స్తంభాలు



పాలెం రోడ్డు వద్ద పడిపోయిన భారీ వృక్షం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ శివారు రామచంద్రపాలెం రోడ్డు వద్ద సోమవారం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై భారీ వృక్షంతో పాటు, విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నున్న గ్రామస్తులు అవస్థలు పడ్డారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. బైపాస్ రోడ్డు నుంచి వాహనాలు రాకపోకలు సాగించాయి. ఎలక్ట్రికల్ ఏడీఈ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో 40 మంది విద్యుత్ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా పనిచేసి రోడ్డును క్లియర్ చేశారు. రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరా పునఃప్రారంభమైంది.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ పునఃప్రతిష్టా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆగమశాస్త్ర ప్రకారం నూతన ధ్వజస్తంభం పునఃప్రతిష్ట చేపట్టేందుకు బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య, యలమంచిలి ప్రసాదశర్మ, కుందుర్తి సీతారామయ్య సారథ్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేద మంత్రోచ్చరణలతో ఉదయం 7.29 గంటలకు ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ట చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. క్రేన్ సాయంతో ఏకశిల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతర శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 5 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, కానుమోలు పీఏసీఎస్ చైర్మన్ చిన్నాల సత్యగణేష్ బాబు, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహామూర్తి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జగ్గయ్యపేట అర్బన్: మహిళా పక్షపాతిగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, వాటిని మహిళలంతా సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. పట్టణంలోని 11 వ వార్డు దుర్గాపురంలో సోమవారం మెప్మా ఆధ్వర్యంలో కనకదుర్గ మహిళా సమాఖ్య వారు ఏర్పాటుచేసిన డ్వాక్రా మహిళల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల్లో మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత తదితర పథకాలన్నీ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకే అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని వారు ముందుకు పోవాలన్నారు. అనంతరం దుర్గాపురం పరిసర ప్రాంత ప్రజలను కలిసి అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సమస్యను స్థానికులు ప్రస్తావించగా, త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాపు నిర్వహించారు. సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక అధ్యక్షతన జరిగిన సదస్సులో బాలభవన్ ప్రోగ్రం మేనేజర్ జి.శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసై విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి మౌనిక, మహిళా సంరక్షణ కార్యదర్శి నాగమల్లేశ్వరి, పలువురు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.